క్లుప్తంగా

పగలే వెన్నెలాయే..!


పట్ట పగలు వెలుగుతున్న వీధిలైటు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పుత్తేరి గ్రామంలోని వీధిలైట్లు పట్టపగలు కూడా వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్ వృథా అవుతోంది. లైట్లు తొందరగా దెబ్బతింటున్నాయి. లైట్లను ఆఫ్ చేయడానికి స్విచ్‌లను ఏర్పాటు చేయకపోవడంతోనే ఇలా విద్యుత్ ఉన్నంత సేపు వెలుగుతూనే ఉన్నాయి. విద్యుత్ శాఖ, పంచాయతీ అధికారులు, చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైన సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి, స్విచ్‌లు ఏర్పాటు చేసి, పగలు లైట్లు వెలగకుండా చూడాలని గిరిజనులు కోరుతున్నారు.

మురుగు కాలువలు నిర్మించండి


రోడ్డుపైకి చేరిన మురుగు నీరు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కారణి గ్రామంలో మురుగు కాలువలు లేక పోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మురుగు కాలువలు లేకపోవడంతో ఇళ్లల్లోని మురుగునీరు వీధుల్లోకి చేరుతుంది. దీంతో వీధులు మురుగు నీటితో బురదమయం అవుతున్నాయి. ఫలితంగా దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. దోమల బారినపడి గ్రామస్తులు జ్వరాలతో ఆస్పత్రులకు పరుగు తీయాల్సివస్తోంది. మురుగు నీరు నుంచి వస్తున్న దుర్గంధాన్ని తట్టుకోలేక పోతున్నారు. మురుగు కాలువలు నిర్మించాలని, పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మురుగు కాలువలను నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం


అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని లక్ష్మీపురం గిరిజన కాలనీలోని అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. దీంతో గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ అంగన్‌వాడీ కేంద్రంలో 32 మంది గర్భిణులు, బాలింతలు, పిల్లలున్నారు. ఈ భవనాన్ని ఆరేళ్లుగా నిర్మిస్తూనే ఉన్నారు. దీంతో గర్భిణులు, బాలింతలు, పిల్లలు అంగన్‌వాడీ కార్యకర్త ఇంటి వద్దకు వెళుతున్నారు. అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయించాల్సిన అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు. సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సాహితీ కళాకారులకు సత్కారం

తిరుపతి కల్చరల్: సాహిత్య, సేవా, కళా రంగాలలో సేవలు అందిస్తున్న వారిని ఆదివారం ఘనంగా సత్కరించి అభినందించారు. జీవకోనలోని విశ్వం స్కూల్లో దేశభక్తి, సాంస్కృతిక సంబరాలు మార్పు సేవ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏర్పేడు మండలం బాలాకృష్ణాపురం భజన బృందం, గురవయ్య పండరి భజన బృందం దేశభక్తి పాటలు, పల్లెజన జీవన జానపద గీతాల భజనలతో కళా బృందాల ప్రదర్శన ఆకట్టుకుంది. పలువురిని జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యువ సమాజ నిర్మాణ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు టి.వెంకటేశ్వర్లు, మార్పు సేవా సంస్థ గురవయ్య, డోలు మాస్టర్ సంజీవయ్య, పలువురు సాహిత్య, సేవా, కళారంగాల కళాకారులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

మూడోకన్ను మూసుకుపోయింది..!

- పనిచేయని సీసీ కెమెరాలు • చెలరేగుతున్న చోరులు
- పెరుగుతున్న చోరీలు • పట్టించుకోని పోలీసు అధికారులు



సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న నేటి కాలంలో సీసీ కెమెరాల ప్రాధాన్యత ఎనలేనిది. పలు ఘటనల్లో వీటిలో నమోదైన దృశ్యాలు దర్యాప్తునకు కీలకంగా మారుతున్నాయి. దురదృష్టవశాత్తు వీటిపై పోలీసు శాఖ నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో పలు సమయాల్లో కేసును కీలక మలుపు తిప్పే ఆధారాలు చెదిరిపోతున్నాయి. ఇటువంటి నిఘా నేత్రాలు కనీసం పనిచేస్తున్నాయో లేదో కూడా చూడడం లేదు. ఫలితంగా చోరీలు, హింసాత్మక ఘటనలు పెరిగిపోతున్నాయి.


వెంకటగిరి రోడ్డు కూడలిలో పనిచేయని సీసీ కెమెరా

ఏర్పేడు: మండలంలోని నిఘా నేత్రాలైన సీసీ కెమెరాలు మూసుకుపోయాయి. ఇదే అదనుగా భావించిన చోరులు చెలరేగుతుండడంతో దొంగతనాల సంఖ్య పెరుగుతోంది. అయినా సీసీ కెమెరాల నిర్వహణ, మరమ్మతుపై పోలీసు ఉన్నతాధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండడంపై విమర్శలు వస్తున్నాయి. నేరాల అదుపు, నిందితుల గుర్తింపు, అసాంఘిక శక్తుల కదలికలు, కేసుల ఛేదింపులపై నిఘా ఉంచే సీసీ కెమెరాలు ఏర్పేడులో పనిచేయడం లేదు. పోలీసు అధికారుల పర్యవేక్షణ లోపమే ఇందుకు ప్రధాన కారణమని ప్రజలు విమర్శిస్తున్నారు. ఏర్పేడులోని వెంకటగిరి రోడ్డు కూడలిలో రెండు, పోలీస్ స్టేషన్, కోబాక రోడ్డుకు వెళ్లే మార్గంలోని చెక్ పోస్ట్ వద్ద రెండు సీసీ కెమెరాలను అమర్చారు. అయితే అవి పనిచేస్తున్నాయా? లేదా అని కూడా పోలీసులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలున్నాయి. వీటిలో పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న సీసీ కెమెరా తప్ప మిగిలినవి రెండు నెలలుగా పనిచేయడం లేదని తెలుస్తోంది.

రెచ్చిపోతున్న చోరులు

నిఘా నేత్రాలు పనిచేయకపోవడంతో చోరులు రెచ్చిపోతున్నారు. గత నెలలో మండలంలోని బండారుపల్లెకు చెందిన రామిరెడ్డి తమ ద్విచక్ర వాహనాన్ని ఏర్పేడు యూనియన్ బ్యాంకు ముందు ఉన్న వంతెనపై ఉంచాడు. తిరుపతికి బస్సులో వెళ్లి తిరిగి సాయంత్రం ఏర్పేడుకు రాగా తమ ద్విచక్ర వాహనం పట్ట పగలే చోరీకి గురైంది. అలాగే ఇసుకతాగేలికి చెందిన ఓ మహిళ ఏర్పేడు యూనియన్ బ్యాంకు నుంచి తెస్తున్న రూ. 50 వేలు నగదును గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. రెండు నెలలుగా గుర్తు తెలియని వ్యక్తులు రాత్రిళ్ల అంజిమేడు, మడిబాక, ఇసుకతాగేలి, పాతవీరాపురం, సీతారాంపేట, ఏర్పేడు, నచ్చనేరి, రాజులపాళెం, మన్నసముద్రం, కోబాక, కొత్తవీరాపురం తదితర గ్రామాల వ్యవసాయ పొలాల్లోని వందలాది రైతుల స్టార్టర్లు, వ్యవసాయ కేబుల్ వైర్లు యథేచ్ఛగా చోరీ చేసి, ఏర్పేడు మీదుగా శ్రీకాళహస్తి, రేణిగుంట, తిరుపతి పట్టణాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఏర్పేడులో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో గుర్తించలేక పోతున్నారని స్థానికులు అంటున్నారు.


కోబాక రోడ్డులో చెక్ పోస్ట్ వద్ద పనిచేయని సీసీ కెమెరాలు

చోరులకు వరం



సీసీ కెమెరాలు పనిచేయకపోవడం చోరులకు వరంగా మారింది. ఏర్పేడు యూనియన్ బ్యాంకు వద్ద ఉంచిన ద్విచక్ర వాహనం పగలే చోరీకి గురైంది. నిందితుల గుర్తింపు, ద్విచక్ర వాహనం రికవరీ పోలీసులకు కష్టతరంగా మారింది. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో చోరీలు అధికమవుతున్నాయి.
– వెంకటేశ్వరరావు, అశోక్ నగర్, ఏర్పేడు.

సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలి



గ్రామాల్లో చోరీలు పెరిగిపోతున్నాయి. ప్రధానంగా రాత్రిళ్లు రైతుల స్టార్టర్లు, కేబుల్ వైర్లు చోరీ చేసి దొంగలు ఏర్పేడు మీదుగానే వెళుతున్నారు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగల గుర్తించలేకపోతున్నారు. సీసీ కెమెరాలు మరమ్మతు చేసి, చోరీలను నియంత్రించాలి.
– రంగయ్య, చిందేపల్లి, ఏర్పేడు మండలం.

కమాండ్ కంట్రోల్ పర్యవేక్షణలో సీసీ కెమెరాలు



ఏర్పేడులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పర్యవేక్షణ తిరుపతి కమాండ్ కంట్రోల్ ఆధీనంలో ఉంటుంది. సీసీ కెమెరాలు పనిచేయకుండా ఉంటే వారితో మాట్లాడి ఏర్పాటు చేస్తాం. లేదా ఉన్నవాటి మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. ఇకపోతే చోరీ కట్టడికి చర్యలు తీసుకుంటాం.
– శ్రీరామశ్రీనివాసులు, ఏర్పేడు సీఐ, ఏర్పేడు మండలం.

నిరుపయోగంగా షాపింగ్ గదులు


రేణిగుంటలో మూతవేసి ఉన్న షాపింగ్ కాంప్లెక్స్

రేణిగుంట: పట్టణంలోని మంచినీళ్ల గుంట(గుంటకట్ట) వద్ద తుడా నిధులతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ గదులు ఎవరికీ కేటాయించకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. ఆరు నెలల కిందట ఇక్కడ వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. దీంతోపాటు రూ.12లక్షల వ్యయంతో మూడు గదులతో షాపింగ్ కాంప్లెక్స్‌ని నిర్మించారు. అయితే తుడా అధికారులు ఈ గదులను పంచాయతీకి అప్పగించకపోవడంతో వారు గదుల వేలం పాట నిర్వహించలేదు. దీంతో ఆరు నెలలుగా గదులు మూసివేసి ఉన్నాయి. వాటికి వేలం పాట నిర్వహించి దుకాణాదారులకు అప్పగిస్తే పంచాయతీకి ఆదాయ వనరులు సమకూరుతాయని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా పోలేరమ్మ పొంగళ్లు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కారణి దళితవాడలోని గ్రామదేవత పోలేరమ్మకు ఆదివారం దళితులు ప్రత్యేక పూజలు చేసి, పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. అనంతరం అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో దళితవాడలో జాతర వాతావరణం నెలకొంది. పోలేరమ్మ విగ్రహానికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి, ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. దేవాలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ముక్కంటి సేవలో యూనియన్ హోమ్ సెక్రటరీ


ఆలయ ధ్వజస్తంభం వద్ద అజయ్‌కుమార్‌భల్లా

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని ఆదివారం కేంద్ర యూనియన్ హోమ్ సెక్రటరీ అజయ్‌కుమార్ భల్లా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ఆలయ వేదపండితులు వారిని ఆశీర్వదించి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా ఊంజల్ సేవ


ఊంజల్‌సేవలో పాల్గొన్న నిర్వాహకులు

నాగలాపురం: గ్రామదేవత చెల్లాతమ్మకు ఆదివారం ఊంజల్ సేవ వైభవంగా నిర్వహించారు. ఆడినెల చివరి ఆదివారం సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారినికి మహిళలు పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సాయంత్రం అమ్మవారి ఉత్సవ మూర్తికి ఊంజల్ సేవ నిర్వహించారు. భక్తులకు ఆలయ ప్రధాన అర్చకుడు జానకీరామన్, నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

చిన్నపిల్లల అత్యవసర చికిత్సపై అవగాహన

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాల ఆధ్వర్యంలో రుయా ఆస్పత్రి చిన్నపిల్లల విభాగంలో అత్యవసర సమయంలో అందించాల్సిన చికిత్సపై వైద్య విద్యార్థులకు, వైద్యులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేరళ రాష్ట్రం కొట్టాయంకు చెందిన చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ బాలచందర్, కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపూర్‌కు చెందిన డాక్టర్ వెంకటాచలపతి, డాక్టర్ ఘనశ్యామ్ చౌదరి (లక్నో), డాక్టర్ కేశవులు (హిందూపూర్) ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ×రేషనల్ ఇవాల్యుయేషన్ ఆఫ్ క్రిటికల్ ఇన్‌ఫెక్షన్ ఇన్ పిడియాట్రిక్ ఎమర్జెన్సీ, ప్రాజెక్ట్ ఏంజెల్‌↑ అనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో రుయా చిన్నపిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్ మనోహర్, ప్రొఫెసర్ డాక్టర్ కిరీటి, అంజన్‌కుమార్, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్స్ పాల్గొన్నారు.

పఠనాసక్తి పెంపుతో సమాజం వైపు..

- 'అరసం' జాతీయ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ


కవితా సంపుటిలను ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్: విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించి సమాజం వైపు వారి దృష్టి మళ్లించాల్సిన అవసరం ఉందని, ఈ దిశగా ఈ తరం కోసం కథా స్రవంతి, కవితా స్రవంతి పేరిట పలువురు ప్రముఖుల కథలు, కవితలను అరసం సంపుటాల రూపంలో ముద్రించే ప్రయత్నానికి పూనుకుందని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ప్రచురించిన 4 కవితా సంపుటిల ఆవిష్కరణ సభ ఆదివారం బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మధురాంతక నరేంద్ర, సాహితీ విమర్శకులు మేడిపల్లి రవికుమార్, అరసం రాష్ట్ర నేత సాకం నాగరాజులతో కలిసి వీటిని ఆవిష్కరించారు. సోమసుందర్ కవిత్వాన్ని పెనుగొండ లక్ష్మీనారాయణ, నాగభైరవ కోటేశ్వరరావు కవిత్వాన్ని మధురాంతకం నరేంద్ర, ఆలూరి బైరాగి కవిత్వాన్ని మేడిపల్లి రవికుమార్, గరిమెళ్ల సత్యనారాయణ కవిత్వాన్ని సాకం నాగరాజు విశ్లేషించారు.మరో అతిథి అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ, విలువలు విలుప్తమైపోతున్న ఇప్పటి పరిస్థితుల్లో సాంస్కృతిక పునర్వికాసం కోసం అరసం విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అనంతరం ఆత్మీయ అతిథి రచయిత మూరిశెట్టి గోవింద్ మాట్లాడారు. కార్యక్రమంలో అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యువశ్రీ మురళి, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, పల్లిపట్టు నాగరాజు, పేరూరు బాలసుబ్రమణ్యం, మన్నవ గంగాధర ప్రసాద్, కాంతారావు, తోట వెంకటేశ్వర్లు, మల్లారపు నాగార్జున, నడ్డి నారాయణ, గొడుగుచింత గోవిందయ్య, టింకాలయ దామోదరం, మేఘనాథ్‌రెడ్డి, ఏడుకొండలు, మల్లేశ్వరరావు, అంకమనాయుడు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోండి

వరదయ్యపాళెం: సీఎం చంద్రబాబు సత్యవేడు నియోజకవర్గం అభివృద్ధి గురించి పట్టించుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాలగురవం బాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన వరదయ్యపాళెంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో శ్రీసిటీ పారిశ్రామికవాడ ఏర్పాటు జరిగిందన్నారు. మహానేత సంకల్పంతో ఎంతో మందికి ప్రైవేటు పరిశ్రమల్లో ఉద్యోగాలు లభించాయన్నారు. అయితే స్థానికంగా భూములు కోల్పోయిన రైతులు, వారి పిల్లలకు మాత్రం చిన్నపాటి ఉద్యోగాలతో సరిపెట్టి, ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో స్థానికేతరులు ఉన్నారన్నారు. దీన్ని గురించి అనేకసార్లు శ్రీసిటీ యాజమాన్యానికి విన్నవించినా పట్టించుకోలేదన్నారు. కాస్త మీరేనా పట్టించుకోవాలని చంద్రబాబుకు హితవు పలికారు.

నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మీ కోసం–ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎన్.మౌర్య ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలపై అర్జీలు ఇచ్చేవాళ్లు ఆధార్ కార్డు జెరాక్స్, ఫోన్ నంబర్ ఇవ్వాలన్నారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం


విశేషాలంకరణలో అమ్మవారు


అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట ద్రౌపదీ సమేత ధర్మరాజుల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి భక్తులు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు పలు రకాల అభిషేకాలు, విశేషాలంకరణ, పూజలు చేశారు. అగ్నిగుండ ప్రవేశం చేసే భక్తులు కంకణాలు ధరించారు. కంకణాలు ధరించిన భక్తులు పసుపు దుస్తులు ధరించి, స్నానాలు ఆచరించి గోవిందనామ స్మరణలతో క్యూలో నిలబడ్డారు. పోతురాజుతోపాటు అమ్మవారి ఉత్సవమూర్తిని అగ్నిగుండం వద్దకు తీసుకువచ్చి కొలువుదీర్చారు. అమ్మవారి పైట చెరుగులో నిప్పులు మూటకట్టారు. ముందుగా ఆలయ పూజారి పూల చెండును అగ్ని గుండలో వేసిన అనంతరం గుండంలోకి ప్రవేశించారు. తరువాత భక్తులు గోవిందనామ స్మరణలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు బందోస్తు ఏర్పాటు చేశారు.

గుజిరి వ్యాపారుల సమస్యలు పరిష్కరించరూ!

తిరుపతి కల్చరల్: నగర పాలక శుభ్రతలో గుజిరి వ్యాపారులు కీలకపాత్ర పోషిస్తున్నా వారి సమస్యలు పరిష్కరించడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇకనైనా వారి సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ, నగర కార్యదర్శి ఎన్‌డీ.రవి డిమాండ్ చేశారు. ఆదివారం గంధమనేని శివయ్య భవన్‌లో గుజిరి వ్యాపార సంఘం నేతల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ, గుజిరి వ్యాపారుల లైసెన్సులు రెన్యూవల్ చేయాలని, ఈ వ్యాపారాన్నే నమ్ముకుని వేలాది కార్మికులు జీవిస్తున్నారన్నారు. వారి సమస్యలను పరిష్కరించని పక్షంలో వారి పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో గుజిరి వ్యాపారుల సంఘ నేతలు అల్లాబక్షు, దాము, రాధ, అజీమ్, శ్రీరాములు, రాము పాల్గొన్నారు.

దిగొచ్చిన కోడి

- తగ్గిన చికెన్ ధర
- మాంసాహార ప్రియులకు సంతోషం



బుచ్చినాయుడుకండ్రిగలో చికెన్ షాపు

బుచ్చినాయుడుకండ్రిగ: పదిరోజుల క్రితం వరకు పర్వదినాలు, శుభకార్యాలు ఉండడంతో చికెన్ ధరలు కొండెక్కాయి. అయితే వారం రోజుల వ్యవధిలోనే ఊహించని రీతిలో చికెన్ ధరలు భారీగా పతనమైంది. రెండు వారాల క్రితం కిలో రూ. 300 ఉన్న చికెన్ ధర ఇప్పుడు రూ. 160కు అమ్ముతున్నారు. గత మహాశివరాత్రి తరువాత చికెన్ ధర రోజురోజుకు పెరుగుతూ రూ.300కు చేరింది. ఇది మాంసం ప్రియులకు మింగుడు పడలేదు. శ్రావణ మాసం మొదలు కావడంతో వ్రతాలు, నోములు ప్రారంభమైన నేపథ్యంలో అధిక శాతం మంది మాంసాహారం మానివేశారు. ఈ క్రమంలో వినియోగం భారీగా పడిపోవడంతో ధర కూడా తగ్గింది. ఏది ఏమైనా ధర తగ్గడంపై వినియోగదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మరింత తగ్గే అవకాశం

ఆషాఢ మాసం చివరిలోనే చికెన్ ధరలు పడిపోయాయి. శ్రావణమాసం మొదలు కావడంతో మాంసాహార వినియోగం గణనీయంగా పడిపోతుంది. శ్రావణమాసంలో 60 శాతం మంది మాంసాహారాన్ని భుజించరు. దీంతో చికెన్ ధర మరింత తగ్గిపోయే అవకాశముందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

మాంసాహార ప్రియులకు ఊరట



చికెన్ ధర తగ్గడంతో మాంసాహార ప్రియులకు ఊరట కలిగింది. మూడు నెలలుగా చికెన్ ధర భారీగా పెరిగింది. దీంతో సామాన్యులు, పేదలు కొనలేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ధర తగ్గడంతో పౌష్టికాహారం తినటానికి వీలు కలుగుతుంది.
– బాలాజీ నీర్పాకోట గ్రామం

వినియోగం పడిపోయింది



చికెన్ వినియోగం పూర్తిగా పడిపోయింది. ఈ కారణంతోనే ప్రస్తుతం చికెన్ ధరలు సగానికి సగం పడిపోయాయి. శ్రావణ మాసంలో మహిళలు వ్రతాలు, నోములు నోచుకోవడంతోనే మాంసాహారం ఇంట్లో చేయరు. ఫలితంగా మాంసాహారం తినే వారి సంఖ్య తగ్గింది.
–గిరి, నీర్పాకోట గ్రామం

అపూర్వ సమ్మేళనం

ఏర్పేడు: స్థానిక హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 2002–2003 ఏడాది పూర్వ విద్యార్థులు ఏర్పేడు హైస్కూల్‌లో కలిసి అలనాటి చిలిపి చేష్టలు, తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు రాఘవయ్య, ఉపాధ్యాయులు వనజాక్షి, నాగరాజు, సుందరమ్మ, భువనేశ్వరి, వర్మ, మూర్తి, వరలక్ష్మి, గౌస్‌లను పూర్వ విద్యార్థులు శాలువలు, పూలమాలలతో సన్మానించి వారి నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. పూర్వ విద్యార్థులు విరాళాలు సేకరించి పాఠశాల అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో ఏర్పేడు బీసీ హాస్టల్ వార్డెన్ పల్లా వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

శ్రీకాళహస్తిని అంతర్జాతీయస్థాయికి తీసుకెళతాం

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయాన్ని బృహత్తర ప్రణాళికతో అంతర్జాతీయ స్థాయికి తీసుకెళతామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బృహత్తర ప్రణాళిక కోసం ద్రోణ కన్సల్టెన్సీ రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌పై చర్చించారు. ఈ కార్యక్రమంలో చెన్నై ఐఐటీ ప్రొఫెసర్లు కొండల్రావు, దేవాదాయశాఖ స్థపతి పరమేశ్వరప్ప, సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల డీన్, ఎస్ఈ శేఖర్, ఈఈ గంగయ్య, ఆలయ ఇంజినీరింగ్ అధికారులు, గుంటూరు డీఈ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు, శివం టూ శివం, లోబావి ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేలా మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించనున్నట్లు తెలిపారు. ఫైవ్‌స్టార్ హోటళ్లు, స్టీల్‌పార్కు, షాపింగ్ కాంప్లెక్సు ఇందులో ఉండేటట్లు చూస్తామన్నారు. ప్రపంచ దేశాలకు బాలాజీ కంటే శివుడే ఎక్కువ తెలిసేలా శ్రీకాళహస్తి శివయ్య ప్రతిష్టను పెంచుతామన్నారు. చరిత్రను కాపాడుతూ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రభుత్వ, ఎండోమెంట్ సహకారంతో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేస్తామని చెప్పారు. మిగిలిన నిర్మాణాలను విరాళాల రూపంలో నిధులు సేకరించి అభివృద్ధి చేస్తామన్నారు. తొలుత ఇంటర్నేషనల్ కంపెనీలకు 5 వేల గజాలు కేటాయించి తిరుమల తరహాలో ఆహ్వానిస్తామన్నారు. అలాగే తెలంగాణ, మహారాష్ట్ర భవన్ కోసం అర ఎకరా కేటాయిస్తే భవనాలను ఇక్కడ నిర్మిస్తారన్నారు. మాస్టర్‌ప్లాన్‌కు కొంతమంది అడ్డుపడుతున్నారని, వారిని కూర్చుని బెట్టి చర్చించి వారిని కూడా ఒప్పించి ముందుకెళుతామన్నారు. ప్రస్తుతానికి బడ్జెట్ నిర్ణయించలేదని, మొత్తం ప్లాన్ రూపొందించిన తరువాత వచ్చేవారంలో దానిపై ఆర్కిటెక్చర్స్‌తో చర్చించి అనంతరం ముఖ్యమంత్రితో చర్చించి మూడు ప్లాన్‌లను వారి ముందు ఉంచనున్నట్లు తెలిపారు.